వామనరావు తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

ఆలోచించినకొద్దీ తన జీవనసమస్య క్లిష్టమౌతున్నదే కాని పరిష్కారం దొరకడంలేదు...

ఇంకొంచెం సేపట్లో జయలక్ష్మి వస్తుంది—

ఆమె వస్తే కొంత శాంతి—కొంత హాయి—

ఇరువురూ కలిసి పబ్లిక్ గార్డెన్ కుపోయి ఓమూల కూర్చుని పల్లీలూ, హారీబూట్ తింటూ కబుర్లు చెప్పుకుంటుంటే మనస్సుకు కొంత రిలీఫ్ వస్తుంది—కాని ఆమె ఇంకా రాలేదు—

వామనరావు సిగరెట్ వెలిగించాడు.

పరీక్షలు దగ్గరకు వస్తున్నాయి.

అంతా గట్టిగా చదువుతున్నారు, కాని తాను పుస్తకం ముట్టుకోవడంలేదు—

ఇది న్యాయమా? అన్యాయమా??

పల్లెటూళ్లో తండ్రికి ఇది అన్యాయమే!

కాని తనకు న్యాయంగానే కనిపిస్తున్నది—

అసలు చదివి సాధించేదేమ టనిపించింది వామన్ కు—

సిగరెట్టు పొగలు గాలిలో మేఘాలు సృష్టిస్తున్నాయి—

పూర్వం కన్నా రద్దీ ఎక్కువై పోయింది—

నాంపల్లి లో ఎవరు రైలుదిగినా సరే చిక్కడపల్లి లోనే మకాం పెట్టాలని యోచిస్తుంటారు—వేరేచోటికి పోకూడదూ వీళ్లు? ఆ బంజారాహిల్స్‌వైపో, ఫలక్‌నామా వైపుకో ? ?—ఈ మనుషుల మనస్తత్వం ఇంతే ! !

మనిషిమీద మనిషి—

ఇంటిమీదఇల్లు—ఒకర్ని వదలి ఒకళ్లు పోరు...ఏం ప్రపంచం...

వామనరావు నవ్వుతున్నాడు...

ఇతరులనుగూర్చి ఇన్ని అనుకున్నాడు కాని తన గురించి తాను ఆలోచించుకో లేదు—

తానే పోయి ఏ డబీపురా లోనో ఉప్పుగూడాలోనో ఎందుకుండకూడదు? ?

అక్కడ సౌకర్యాలు తక్కువ అన్నది వామనరావు మనస్సు. 'అదే నోయ్ పిచ్చీ అందరూ అంతే—అందుకే ఇక్కడే వేళ్లాడుతుంటారు' అన్నాడు తన మనస్సుతో వామనరావు.

తలుపు కొట్టిన శబ్దం !

వామనరావు హుషారుగా లేచి సిగరెట్ గిరవాటువేసి తలుపుతీస్తూ 'ఇంత ఆలస్యమా...' అన్నాడు.

రమేష్ లోపలికివస్తూ 'అదే—నేను వస్తానని నీ కెలాతెలుసు ?' అన్నాడు స్కూటర్ తాళం వెనుకజేబులో వేసుకుంటూ.

వామనరావు నిరాశాహతుడైనాడు—

నిస్సహాయుడైనాడు—

ఓ పక్షంరోజులు ఫ్లూతో పీక్కుపోయిన వాడిలా వెళ్లి ఈజీఛైర్ లో పడ్డాడు.

'ఏంరా భాయ్ అలాఅయిపోయినావ్ ?'

రమేష్ కంగారుపడ్డాడు...

'ఏం లేదు లేరా. ఒంట్లో అంత బాగా లేదు.'

'అరెరే! ఇంకా నయం—నవరంగ్ లోకి మంచి క్రైమ్‌థిల్లర్ వచ్చింది—నీకిష్టం కదా అని టిక్కెట్లు బుక్ చేద్దామనుకున్నాను...'

'థ్యాంక్స్ బ్రదర్—నీ అవ్యాజాను రాగానికి' వామనరావు ఉసురుమన్నాడు—

ఇందులో అవ్యాజానురాగ మేమీలేదు-ముందు టిక్కెట్లు రమేష్ కొన్నా వడ్డీతో సహా హోటళ్లతోసహా వామనే తిరిగి ఇచ్చుకుంటాడు.

రమేష్ ఏదో మాట్లాడుతున్నాడు—

కాని వామనరావు కివేవీ విన్పించ లేదు—

అనుకున్న టైం ప్రకారం ఇప్పటికి అర్ధగంట క్రితమే జయ వచ్చివుండాలి. కాని రాలేదు—

వామనరావు మనస్సు పిచ్చెక్కినట్లయింది—

గట్టిగా తనలోని భావాలన్నిటినీ బలవంతంగా అణచుకున్నాడు—

రమేష్ ఏదో ప్రశ్నిస్తున్నాడు...



వినపడటంలేదు...

మళ్ళీ తనలోని భావాలను అణచి వేసుకున్నాడు ..

కొద్ది క్షణాల్లో మామూలు వాతావరణా నికి వచ్చాడు వామన్.

'ఏం భాయ్—ఊహాలోకాల్లో విహరి స్తున్నావ్?'

వామన్ నవ్వాడు—

'అవునా...నేనో డ్రామాలో వేషం వేస్తున్నానోయ్—నీవు కొంచెం గైడెన్సు ఇవ్వాలి...బెనిఫిట్ షో—రవీంద్ర భారతిలో...'

'ఏం పాత్ర—?'

'బిచ్చగాని పాత్ర'

వామనరావు నవ్వాడు— 'బిచ్చగాడి పాత్రలో ఏం పడతాయి నయాపైసలు తప్ప—అయినా దానికి గైడెన్సు నేను ఇచ్చేదేముంది...చిక్కడపల్లి వెంకటేశ్వర స్వామి గుడివద్ద శనివారం సాయంత్రం నిలుచో — బిచ్చగాళ్లు గుంపులు గుంపులుగావచ్చి బారులుతీరి కూర్చుం టారు—వాళ్లను పరిశీలించు...నేనే ఆ బిచ్చగాడినైతే ఎలా వుంటుందని ఆలో చించు......క్రమంగా నీవు బిచ్చగాడివై పోతావు...నీకు నటన వస్తుంది...చిన్న ప్పుడు నే నలాగే చేశాను—అయితే అభాసుపాలయనాననుకో—'

'ఏం చేశావు?'

'అప్పుడు నేను ఫిఫ్తుఫారం చదువు తున్నాను—మా లెక్కల మాష్టారికి నాట కాలంటే భలే సరదా. ఆ సంవత్సరం స్కూల్‌డేకు 'దశావతారా'లనే నాటకం తయారు చేయించాడు—అదైతే చాలా మందికి వేషం వేయించే అవకాశం ఇప్పించి టాలెంట్‌ను ప్రోత్సహించ వచ్చునని ఆయన ఉద్దేశం—సరే—నేను

అందుకని నాకో వామనుడిపాత్ర ఇచ్చారు— ఏదో ఒకటి — అంతా హుషారుకదూ! వెంటనే పోర్షను తీసుకొని శ్రద్ధతో రాసుకొని పరీక్షపాఠాలకన్నా గట్టిగా బట్టీ పెట్టాను—ప్రతిరోజూ ఇంటివద్ద నాలో నేను రిహార్సల్ వేసుకునేవాడిని. ఎదురుగావున్న ఏకుర్చీనో, స్టూల్‌నో బలిచక్రవర్తిగా భావించి మూడడుగుల దానం ఇమ్మని అడుగుతూ వుండేవాడిని—తీరా నాటకంరోజున చూద్దును — పూర్తిగా వామనుణ్ణె అయిపోయాను... 'అరేయ్ అన్నం తిను త్వరగా — మీ లెక్కల మాష్టారు మేకప్‌కు త్వరగా రమ్మన్నాడు' అని ఇంట్లోవాళ్లు చెపుతుంటే నేను 'అహ్హాహ్హా' అని నవ్వుకుంటూ సాక్షాత్తు శ్రీ మహావిష్ణువునే అయినట్లు భావించుకుంటూ 'క్షుద్రులారా' అని ఎగతాళి చేస్తూవున్నాను—

మా పిన్నమ్మ 'బాబూ వామనా— అన్నం చల్లారిపోతున్నది — ఈగలు ముసురుతున్నాయి' అంటూ దగ్గరికివచ్చి పిలిచింది—

'అహ్హాహ్హా—క్షుద్రులారా!' అన్నాను—

ఆవిడ నిర్వేరపోయి 'ఏమిటీ కూస్తున్నావు' అన్నది—

'ఓసీ క్షుద్రరాక్షసీ! నేనెవడను— దుష్టశిక్షణకు శిష్టరక్షణకును అవతరించిన ఆదివిష్ణువునే కాని మీబిడ్డడు వామనుడని తలంచుచుంటివా—పాపాత్మురాలా! ఛీ! కూడు కుడువుము" నా నోటివెంట ఏం మాటలు వస్తున్నాయో నాకే తెలియదు. దానితో ఆమెకు చాలా కోపంవచ్చి లాగించి రెండు లెంపకాయ లిచ్చింది— గుడ్లు గింగిరాలు తిరిగినాయి—గూబలు గుయ్ మన్నాయి—ఆ దెబ్బతో నేను మామూలు పరిస్థితిలోకివచ్చి రెండు ముద్దలు తిని స్కూలుకు పరుగెత్తాను—

అక్కడ మేకప్‌లు జరుగుతున్నాయి—ఆలస్యమైనందుకు మాష్టారు తిట్టారు...ఓ అరగంటలో నా మేకప్ అయింది—వరసగా మత్స్య కూర్మ వరహా నారసింహావతారాలు అయినాయి— వామనావతారం వచ్చింది—మహావిష్ణువు వేషం వేసినతడు నేను బలిచక్రవర్తిని మూడడుగుల దానం కోరినతర్వాత వస్తాడన్నమాట— 'పో తొందరగా' నన్ను తొందర పెట్టాడు—

వేషం వేసుకున్నప్పటినుంచీ నాకేదో కొత్త శక్తివచ్చినట్లనిపించింది—నన్ను నేను పూర్తిగా మరచిపోయాను... నాకెదురుగా బలివేషం వేసిన బుచ్చిగాడు నా స్నేహితుడూ క్లాసుమేటూ బెంచీమేటన్న సంగతి జ్ఞప్తికిలేకుండా పోయింది — స్టేజీమీదికి పోయాను—నాకు లైట్లు, ఆడియన్సూ కన్పించలేదు. బుచ్చిగాడూ కన్పించలేదు—ఎదురుగా ఓ రాక్షసాధముడు 'కారే రాజులు రాజ్యముల్ గలుగవే గర్వోన్నతింజెందిరే' అనే పద్యం

చదువుతున్నట్లని పించింది...మూడడుగుల దానం అడగడం, బలి ఇవ్వడం అయిపోయింది—దానితో విష్ణువు విరాట్స్వరూపం వేషంతో మరొకవ్యక్తి వస్తాడు—ఈ లోపల లైటింగ్ ఎఫెక్ట్‌తో స్టేజీపై బలిని మాత్రమే చూపుతుంటారు—నేను నిష్క్రమించాలి...కాని నిష్క్రమించలేదు...నాలో బలిపై ఆవేశం, ద్వేషం పెరిగింది—నేనే సాక్షాత్తూ మహావిష్ణువునూ విరాట్స్వరూపుణ్ణిగా భావించుకున్నాను—నా కర్తవ్యం ఈ రాక్షసాధమ సంహారమని తోచింది. ఎడమకాలితో బలివేషంవేసిన వాణ్ణి ఒక్క తన్ను తన్నాను—వాడి రాజు కిరీటమూ, విగ్గూ ఊడి క్రిందపడ్డాయి—ఆడియన్సు ఈలలు వేస్తున్నారు—ఒకటే గోల—గందరగోళం అయినా నాకు వళ్లు తెలియలేదు—చేతిలోవున్న వటువు పట్టుకున్న తాటాకుల గొడుగుతో బుచ్చిగాణ్ణి రెండు మోదాను—వాడు కుయ్యో మొర్రో అనుకుంటూ అదే పరుగు సైడు కర్టెను గుండా—తెరపడింది—హెచ్.యం.లెక్కల మాష్టారూ నన్ను పట్టుకొని గ్రీన్‌రూమ్ లోకి తీసుకుపోయారు. ముఖాన సోడా నీళ్లు చిలకరించారు—'ఏయ్ రాక్షసాధమా' అని అరుస్తున్నాను— "పడుకో బాబూ పడుకో—రాక్షసాధముడు పాతాళంలోకి పోయినాడులే" అని మా లెక్కలమాష్టారు నన్ను బుజ్జగించి ఓ బెంచీపైన పడుకోపెట్టారు ఎవ్వరినీ చివరకు మాపిన్నమ్మను కూడా ఓ గంటసేపటివరకూ నన్ను చూడడానికి రానివ్వలేదు...... అట్లా రసాభాసమైంది వామనుడు వేషం—అందుకనే పాత్రలో లీనంకాకు—నేను వేరు, పాత్ర వేరు అనుకొని నటించు—

రమేష్ వామనరావు అనుభవానికి నవ్వుకున్నాడు. "అదేమిటోయ్—మరి స్టానిస్లవిస్కీ అట్లా చెప్పాడు—

"ఏట్లా చెప్పాడు—"

'నేనే ఆ పాత్ర ననుకోమన్నాడు—"

"సరే—అనుకో—మరోసారి రవీంద్ర భారతిలో నా బలిచక్రవర్తి వ్యవహారం రిపీట్ అవుతూంది..."

'వస్తాను వామన్— వేరే ఓ పని చూచుకొని రిహార్సల్‌కు కూడా వెళ్లాలి—"

రమేష్‌ను వామనరావు వీడ్కొలిపాడు—తలుపేసి వచ్చాడు—రమేష్ ఉన్నకాసేపు ఏదో తన్ను తాను మరచిపోయి సంభాషణలో పడ్డాడు—

తిరిగి ఇప్పుడు తానూ—తన సమస్యలూ......

జయ రాలేదు...

అంటే ఇంక రాదన్నమాట...

వామనరావు బాగా నిరుత్సాహపడ్డాడు...

ఇంతలో తలుపు కొట్టిన శబ్దం—

నీరసంగా విసుక్కుంటూ వెళ్లి తీశాడు

జయలక్ష్మి!!

వామనరావుకు ఆశ్చర్యం కలిగింది—

"జయా! ఇంత ఆలస్యంగా వచ్చావేం". నీరసమంతా ఎగిరిపోయింది—

కాని జయలక్ష్మి మాత్రం నీరసంగా ముఖం వేలవేసుకొనివుంది...

"అలా వున్నావేం జయా. ఇంత ఆలస్యమయిం దేమిటి; ఇక రావనే అనుకున్నాను" వామనరావు వెంట వెంట ప్రశ్నించాడు.

జయ జవాబు చెప్పలేదు.

కాసేపాగి అన్నది

"పబ్లిక్ గార్డెన్స్‌కు వెళ్దాం వస్తావా వామన్"

"ఇంత పొద్దుపోయా జయా"

"ఏం భయంవేస్తుందా అబ్బాయి గారికి"

"కాదు వాళ్లు గేట్లు మూసుకుంటా రేమోనని"

"ఫరవాలేదులే, బయలుదేరు___

వామన్ మాట్లాడకుండా రూమునకు తలుపు వేసి బయలుదేరాడు. ప్రజాపార్మసీపద్ద నుండి రిక్షా మాట్లాడుకున్నారు.

"ఆహా జానా సాబ్"

"బాగ్‌యాం"

"కిత్‌నే సవారీ"

"దో"

"అచ్చా ఆయియే సాబ్"

"క్యా దేనా భాయ్"

"దో సాబ్ తుమారీ మర్జీ"

"ఐసానహీ వాజ్ బోలో మియా"

"సవాదో సాబ్". రూపాయి పావలా అడిగాడు. నసుగుతూ కూర్చున్నాడు వామన్. జయ పక్కనే కూర్చుంది. ఏమీ మాట్లాడలేదు.

రిక్షావాడుమాత్రం తన గొడవేదో చెప్పుకుపోతున్నాడు. మనిషి కూడా కొంచెం దోస్‌లో వున్నట్లున్నాడు. అదే పనిగా వాగుతున్నాడు.

ఎం. ఎల్. ఏ. క్వార్టర్సు మీదిగుండా బషీర్‌బాగ్ త్రోవ పట్టాడు.

రోజూ జయలక్ష్మి ఏవో కబుర్లు చిలకగా చెప్పేది. తాను మూగిలావున్నా ఛెంగు ఛెంగున మాట్లాడుతూ నవ్వులు రువ్వుతూ కవ్వించేది.

కాని ఇవ్వాళ సంగిలా ముడుచుకు కూర్చుంది.

ఏమో విశేషం...

అడిగే సాహసం లేకపోయింది.

బషీర్‌బాగ్ వద్ద చౌరస్తా.

ట్రాఫిక్ ఆగింది.

రిక్షావాడు ఎవరినో తిడుతున్నాడు...

వామన్ ప్రశ్నించాడు వాడిని.

"నీ బండి ఎక్కడిదని"

లింగంపల్లి పూల్ దగ్గర అని చెప్పాడు.

"నీ పేరేమిటి?"

"కొమరయ్య"

"ఎక్కడినుంచి వచ్చావు?"

"కల్వకుర్తి తాలూకా మహబూబు నగర్ జిల్లా."

"స్వంత బండా."



"ఓహో..." ఎగతాళిగా నవ్వాడు. తన జటుక్కు స్వంతబండేసిం టన్నట్లు.

"కిరాయ్ ఇయ్యాల దొరా రోజుకు రూపాయి పదణాలు... ఇప్పుడు పది కొట్టిందాకా తోలుత. రెండో ఆట చూసు కొని తొంగుంటా... మళ్లీ మబ్బుల్లో లేస్తా..." తన కష్ట సుఖాలు నెమరు వేసుకుంటున్నాడు, ఒక విధమైన స్వగతంలో...

సిగ్నల్ ఇచ్చారు.

ట్రాఫిక్ మళ్ళా కదిలింది.

పబ్లిక్‌గార్డెన్ వచ్చింది.

రిక్షావాడికిడబ్బులిచ్చి వామన్ దిగాడు.

జయ మాట్లాడకుండా అనుసరించింది. ఇద్దరూ లోపలికి వెళ్ళి ఓ మూల కూర్చున్నారు. జయే అకస్మాత్తుగా మొదలుపెట్టింది.

'ఇవ్వాళ్ళ ఇంటినుండి ఉత్తరం వచ్చింది వామన్.'

వామనరావు అదిరిపడ్డాడు...

అనుకుంటూనే వున్నాడు ఈ వార్త ఎప్పుడో వినవలసి వస్తుందని...ఏమి వినబోతున్నాడో ఏమో...

'నేను ఆఫీసుకు పోయేసరికల్లా టేబిల్ పైన ఇన్‌లాండ్ కవర్ వుంది. విప్పి చూశాను. అది మా బాబాయి వ్రాశాడు. రంగధామ్‌తో నా వివాహం ఖాయం చేస్తానని వ్రాశాడు.

'అమ్మా! నా ఒంట్లో కూడా ఏమీ బాగుండలేదు. సాధ్యమైనంత త్వరలో ఈ శుభకార్యం చూచి కన్ను మూస్తే నాకు మనశ్శాంతి లభిస్తుంది. ఏదో పెంచిన ప్రేమ; ఇలా మమకారాన్ని చంపుకో లేకపోతున్నాను. ఎంత నిస్సంగత్వంగా

ుండ ప్రయిత్నించినా– నాలుగు అక్షింతలు పడ్డాక కన్ను మూస్తాను. రంగధామ్‌కూడా తొందర పడుతున్నాడు. నువ్వంటే ఎంత ఇష్టమనుకున్నావు .. ఈ రకంగా సాగింది లేఖ.'

వామన్ ఏమీ మాట్లాడలేదు.

చిరుగాలికి జయ ముంగురులు గాలిలో కదులుతూ వున్నాయి. దూరంగా నౌబత్ పహాడ్‌పై వెలుగులు...

'జయా– నీ ఉద్దేశమేమిటి?' కాసే పాగి అన్నాడు...

జయ మాట్లాడలేదు.

'ఇలా మూగతనం వహించే సమయం కాదిది. త్వరగా ఏ విషయమూ తేల్చిచెప్పు. లేకుంటే అక్కడ మీవాళ్ళు పెళ్ళి ప్రయత్నాలు కూడా చేస్తారు.'

'మీ పెద్దమ్మా వాళ్ళూ...' జయ నోరు విప్పింది. మౌన వ్రతం ముగించి.

'మావాళ్ళను గూర్చిన విచారం నీకువద్దు అది నేను చూచుకుంటాను ఇంతకూ జయా మనమింక కాలక్షేపం చేస్తూ కూర్చోవడం ఉచితం కాదు. ఆలస్యమైతే అమృతం విషమౌతుంది... నీకభ్యంతరం లేకపోతే ముందు రిజిస్టర్ మ్యారేజీ చేసుకుంటాను'

జయ నవ్వింది 'అబ్బ! ఎంత తొందర '

'తొందరపడని తప్పని సమయాలు కూడా వుంటాయి. చేతులు కాలాక ఆకులు పట్టుకొని లాభంలేదు. మీవాళ్ళు ఏదైనా త్వరపడి పెళ్ళి ప్రయత్నాలూ అలాచేస్తే ఏమవుతుంది! ఆ తర్వాత ఇక పంతాలూ పట్టింపులూ, పరువూ ప్రతిష్ఠల సమస్యలూ, రంగధామ్‌ను చేసుకోకపోతే నేను చస్తానని మీ బాబాయి బెదిరింపులూ, ఏదో ఇలాంటి కథంతా ప్రారంభమవుతుంది. జయా నీవేమీ మైనరువు కావు. నీ జీవిత నిర్ణయం నీవే తీసుకోగలవు. తీసుకోవాలికూడా. ఇంక ఆలోచన దేనికి?

'నపరంగ్‌లో "ట్రైన్" వచ్చిందట వెళ్దామా?'

అబద్ధం! ట్రైన్ దిల్షాద్ లోకి వచ్చింది. కేవలం మాట మార్చడం కోసమే జయ ఈ సంభాషణను మరో మార్గం పట్టిస్తున్నది

'జయా, నేనంటే నీకిష్టంలేదా? మాట మారుస్తున్నావు'.

'జయ నవ్వి ఒక్క క్షణం ఆగిఅన్నది. "ఆ ప్రశ్న వేయవలసింది నేను వామన్. నీతో పోల్చి చూచుకున్నప్పుడు నా ఆస్తి కానీ అంతస్తుకానీ తక్కువే. అయినా సరే వివాహం చేసుకోవడానికి అంగీకరించావు అందుకు నేను కృతజ్ఞురాలిని. ఇక రంగధామ్ విషయం అసలు సమస్యే కాదు. నేనెప్పుడూ అతన్ని చేసుకోవాలనుకోలేదు .. అతనంటే నాకసహ్యం కూడా. అతనిలో చాలా దుర్గుణా లున్నాయి ఏ వస్తువైనా తనచేతి కందకపోతే ఎంతకైనా తెగించే హంతకు

కాని నీ జయ ఏమి సుఖపడుతుంది?'

వామన్ అన్నాడు 'జయా! బాంధవ్యం ఒక్కొక్కప్పుడు లోపాలను పట్టివ్వదు. ఎందరు తాగుబోతులకు తెలిసి కూడా, ఏ బంధుత్వం వల్లనో, ఆస్తి కలసి వస్తుందనో సంబంధాలు చేస్తున్న పెద్దలు లేరు? అలాగే మీ బాబాయి కూడా పట్టు పడితే ఏమవుతుంది??...'

"నేను చావనైనా చస్తాను కాని అతన్ని మాత్రం చేసుకోను వామన్. ఒకవేళ నీతో వివాహం కాకపోవడమంటూ జరిగితే ఈ ఎల్. డి. సి. పోస్టులో ఇలాగే రిసెప్షనిష్టుగానే ఉండిపోయేదాన్నే కాని తిరిగి అతనితో వివాహ ప్రయత్నానికి అంగీకరించడమనే ప్రశ్నే లేదు... ఈ విషయమే స్పష్టంగా వ్రాసి పారేశాను."

"వ్రాశావా?"

"ఇంకా ఇంత సేపా? ఎప్పుడో జి.పి.వోలో ఎక్స్‌ప్రెస్ డెలివరీ పోస్టు చేశాను..."

వామన్ నిట్టూర్చాడు బరువు దిగినట్లు.

"వామన్ నీవింక రోజూ నైట్ కాలేజీ మానుకోవడమేమీ బాగాలేదు. ఆ 'లా' డిగ్రీ చేతికొస్తే ఏదో ఒక చోట ఇద్దరం కలసి బతకలేకపోము. నా కోసం చదువుపాడుచేసుకోకు వామన్"... గోముగా అంది జయ.

పడింది. నిజంగా ప్రైవ్ పిక్చర్ కెళ్ళాము. నా కభ్యంతరమేమీలేదు... మా వాళ్ళకు కూడా రేపే జాబు వ్రాస్తాను. సమస్య నింత తేలికగా పరిష్కరించినందుకు నా ధన్యవాదాలు..." జయ చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు...

ఆమె కిలకిలా నవ్వింది... 'ఇల్లలక గానే పండగకాదుసార్. సమస్య ముగియ లేదు. ప్రారంభమైంది. ఇప్పుడే ఉత్తరాలు ప్రయాణం మొదలెట్టాయి. అవి రేపో ఎల్లుండో ఇళ్ళను చేరుతాయి. అక్కడినుండి రియాక్షన్ ప్రారంభమవుతుంది. మా బాబాయి కంగారు పడతాడు. రంగధామ్‌కు కోపం వస్తుంది. అసలు నాకనుమానం_మనమంటే గిట్టని వాళ్లెవరైనా ఇప్పటికే ఆ కర్కోటకుడికి ఈ విషయం తెలిపారేమోనని..."

"జయా మీ బాబాయి నిన్ను అలాంటి వాడికిద్దామనుకోవడం అన్యాయం కాదా? అసలాయనకు వాడిలో లోపాలు కన్పించనే లేదా!"

"కన్పించాయి... కాని వాటికి గుర్తింపు ఇవ్వలేదు... చూడు వామన్! ఆత్మీయత వేయి తప్పులనైనా క్షమింపజేస్తుంది. లోకంలో వేదికలు బద్దలయ్యేటట్లు ఉపన్యాసాలూ నీతిబోధలూ చేసే ఈ నాయకులు తమ స్వంత కొడుకులనెందుకని అదుపులో పెట్టుకోలేక పోతున్నారు?... అంతే! ఇంతకీ ఇప్పుడు

మీ బజాయిని గూర్చి అంత భయపడ నక్కరలేదనుకో——"

"సమస్య ముగియలేదన్నమాట మొత్తంమీద."

"అలాగే తోస్తున్నది."

"రంగధామ్ అంత భయంకరుడా?"

"తుచ్ఛుడు — వాడంటేనే భయం నాకు. ఏం కానిపనిచేస్తాడోనని—వామన్, నీ వొకవేళ రంగధామ్‌స్థానంలో వున్నా వనుకో — ఏం చేస్తావు ??" వామన్ నవ్వాడు. "నేను రంగధామ్ స్థానంలో లేను—వామనరావుస్థానంలోనే వున్నాను—అతడు కేవలం నా రక్తబంధువు. నేనో ప్రాణబంధువును — ఆత్మబంధువును — అంతేకాదు..." అని జయపమిటకొంగు పట్టుకొని 'భర్తను' అన్నాడు.

చాలే శృంగారాలు—పబ్లిక్ స్థలంలో—ఇదేం మనయిల్లు కాదు—ఎవరైనా చూస్తే తాగి తూలుతున్నారని తరుముతారు ఇక్కడనుంచి — మీరింకా భర్తకాలేదు. అయినాక ఈ సరాగాలు మొదలెట్టండి—పదండిక బుద్ధిగా"

"ఉహూ" వామన్ తిరస్కరించాడు.

"ఓహో! అబ్బాయిగారికి పేరుతో పాటే బుద్ధికూడా కుంచించుకుపోతున్నది. రేపు రంగధామ్ రానివ్వండి—ఈ పొంగు నంతా వదలగొడుతాడు — నావల్లకాదు బాబూ ఆ రాక్షసుణ్ణి ఎదుర్కోవడం — అదేదో మీరే దయచేసి పరిష్కరించండి..."

వామన లేచాడు.

జయ లేచింది—

రిక్షా ఎక్కారు — వామన్ అన్నాడు "అతడు హైదరాబాదు వస్తాడంటావా జయా..."

"తప్పకుండా — అసలీపాటికి వచ్చి నాగూర్చి పరోక్షంగా విచారిస్తున్నాడేమో నని అనుమానం... వామన్! మీరేమీ భయపడకండి — సమయంరాగానే తప్పించుకో ప్రయత్నించకండి — ఆత్మహత్య తప్ప నాకింక గత్యంతరముండదు—"

"జయా—ఇదేనా నన్ను నీవర్థం చేసుకున్నది—అటోఇటో చూడవలసిందే కాని రంగధాముడుకాదు యమధర్మరాజు వచ్చినా నేనొక్క అడుగు వెనక్కుపోను—నీవే పాతబాంధవ్యాన్ని స్మరించి జారిపోకుండా ఉండాలికాని—"

జయ బాధగా నవ్వింది — "చూడు వామన్ — నా మనస్సులో మార్పురాదు నిజమే—కాని మానవత్వంతో చూస్తే ఎలా వుంటుంది? రంగధామ్ స్థానంలో నువ్వున్నా ఈ ఈర్ష్యా అసూయలు తప్పకుండా వస్తాయి — తనవంటి లోఫర్‌కు నేను నిజంగా భార్యనైతే అది అతని జీవితంలో ఎన్నో జన్మల వరమనే చెప్పాలి — ఇది ఆత్మస్తుతికాదు కేవలం పరనింద మాత్రమే..."

వామన్ కూడా ఆలోచించడం మొదలుపెట్టాడు. తానొకవేళ రంగధామ్ అయితే... అయితే ఎన్నటికీ అలా



చేయడు. జయలక్ష్మి మనస్సు గమనించి వెంటనే తప్పుకుంటాడు ఆమె జీవితం నుండి— నిజమే! అది తన సంస్కారం కావచ్చు —

కాని సంగధామే తాను కాదుగా...

అతనే యీవార్త వింటే ఏమిచేస్తాడు??

"చిక్కడపల్లి ఆయా సాబ్" రిక్షా వాడు గమ్యాన్ని గుర్తుచేశాడు.

డబ్బులిచ్చి వాణ్ణి పంపుతూ "జయా మళ్లీ దర్శనం ఎప్పుడు" అన్నాడు వామన్.

"రేపు ఎల్లుండీ మా ఆఫీసులో ఏవో ఫంక్షన్స్ ఉన్నాయి. బాగా పొద్దు పోతుంది పార్టీలూ అవీ ముగిసేసరికి— చాలా బాధ్యత నా నెత్తిన పెట్టారు—దయ చేసి నాకోసం ఎదురుచూడకు వామన్"

"అలాకాదు. పార్టీ అయిన తర్వాతే ఒకసారి ట్యాంక్ బండ్ వద్దకు రాకూడదూ"

"సాధ్యపడక పోవచ్చు"

"నాకోసం— ప్లీజ్"

"ఆలోచిస్తాను—టా టా" హాస్టల్ కు అభిముఖంగా పయనించింది జయ.

వామన్ రూం చేరాడు.

అప్పటివరకూ జయతో ఉండటంతో ఏదో మాటల ధోరణిలో తన్ను తాను మరచిపోయాడు కాని ఆమె వెళ్లేసరికి ఏదో వెలితి కన్పించింది — మనస్సు చికాకుగా వుంది.

తిండి తినబుద్ధి పుట్టలేదు.

"ఎలాగో బలవంతాన కళ్లు మూసు కున్నాడు—"

ఫ్యాక్టరీ సైరన్లూ, కాచిగూడాలో రైళ్ల కూతలూ, ఎక్కడో దూరాన మసీదులో నమాజులూ అలా వినిపిస్తూనేవున్నాయి.

మర్నాడు కూడా ఏదో కాలక్షేపం కోసం మార్నింగు షోలూ, డిటెక్టివ్ నవలలూ సాధనాలుగా ఉపయోగించు కున్నాడు. పగలంతా ఒకటే ఆలో చనలు.

రంగధామ్ జయలక్ష్మి మాటలను బట్టి చూస్తే రౌడీలాకన్పిస్తున్నాడు. నేడో రేపో ఒకవేళ హైదరాబాదుకు వస్తే?

ఏమవుతుంది?

ఎలా అతన్ని ఎదుర్కోవలసి వుంటుంది??

వామన్ మనస్సు ఎందుకో కీడును శంకిస్తున్నది_

ఒకవేళ తానే రంగధామ్ స్థానంలో వుంటే ఏమిచేసేవాడు?

జయలక్ష్మి కిష్టంలేనప్పుడు బలవంత పెట్టి ప్రయోజన మేముంది!?

కాని అందుకు తగిన సంస్కారం ఉండవద్దా!!

తనకు దక్కని వస్తువు ఇతరులు అందుకున్నప్పుడు, పొందుతున్నప్పుడు సహించగలిగే ఓర్పు రంగధామ్‌లో ఉంటుందా?

వామన్ తల పందిరీగంతుట్టెలా మారింది. తల తిరుగుతున్నట్లనిపించింది.

ఓ రెండు కప్పుల వద వడి టీ తాగి ఘాటైన ఓ చౌకబారు సిగరెట్ వెల్గిం చాడు...

అలా ఏ రాత్రికి నిద్రపట్టిందో తనకే తెలియదు. మర్నాడు ఉదయం మెలకువ వచ్చేసరికి ఒళ్లంతా రోట్లోవేసి నలగ గొట్టినట్టుంది. బహుశా రాత్రి జ్వరం తగిలిందేమోనని ఊహించాడు. పక్క మీదనుంచి కదిలే ఓపిక కన్పడలేదు_

"నిన్న తిండిలేని ఫలితం" అను కున్నాడు వామన్___

మెల్లగా నరాలు స్వాధీనంలోకి తెచ్చు కొని బ్రష్ నోట్లో పెట్టుకొని వరండాలో పచారు చేస్తుండగా స్థానిక ఇంగ్లీషు దిన పత్రిక వచ్చింది...

హెడ్డింగులు చూడడానికి తీసు కున్నాడు...

అంతే!!

దిగ్భ్రాంతి కల్గించే వార్త!! దారుణ మైన వార్త!!!

వామన్ కళ్లు గిరగిరా తిరిగి పోయాయి_

నోట్లో నుండి బ్రష్, చేతిలోనుండి పేపరూ జారిపడిపోయాయి...

"టాంక్‌బండ్ వద్ద స్త్రీ శవం_ రిసెప్షనిష్టు జయలక్ష్మి అని అనుమానం_ హత్యా? ఆత్మహత్యా!"

వామన్ జీవితంలో ఎన్నడూ ఏడ్చి ఎరగడు. తొలిసారి పెద్దగా ఏడ్చాడు_



పసిపిల్లవాని లాగా పొర్లి పొర్లి దుఃఖించాడు—

ఆతనిలోని స్థైర్యమూ, పౌరుషమూ అంతరించి పోయాయి—

"జయా — నీకప్పుడే నూరేళ్లు నిండాయా? నాపిల్లనేనా ఇంత అన్యాయానికి వడిగట్టావు? నీ కన్యాయం జరగడంతో పాటు నాకూ అన్యాయం చేసిపోయావు జయా..."

వామన్‌ను ఓదార్చే వాళ్ళు, ఓదార్చ శక్తిగల వాళ్ళు లేరు.

వామన్‌కు తెలిసిపోయింది ఇది నిశ్చయంగా రంగధామ్ చేసిన పనేనని—

నరరూప రాక్షసుడు—పశువు—తుచ్ఛుడు చేజేతులా ఇలా ఈ గులాబీ మొగ్గను తుంచి పారవేయగలిగాడా కర్కోటకుడు?

"పగకు పగ—రక్తానికి రక్తం—రంగధామ్‌ను సర్వనాశనం చేయనిదే నేను విశ్రాంతి తీసుకోను" అని ప్రతిజ్ఞ పట్టాడు వామన్—

లేచి గుడ్డలు వేసుకున్నాడు—కాని బలహీనత వల్ల తూలిపోతున్నాడు...ఓ రిక్షా పిలుచుకొని నేరుగా క్రైంబ్రాంచీ కెళ్లాడు—పోలీసు అధికారి డేవిడ్‌కు తన్ను తాను పరిచయం చేసుకున్నాడు—

"నా పేరు వామన్. డే టైం పార్ట్ టైమర్‌గా పరోపకారీ కాటేజ్ ఇండస్ట్రీస్‌లో పనిచేస్తూ రాత్రిపూట లా ఫినిష్ చేస్తూ వున్నాను... ట్యాంక్‌బండ్ వద్ద జరిగిన హత్య గూర్చి వచ్చాను"

పోలీసు ఆఫీసర్ ఆదుర్దాగా "ఆమె మీకు బాగా తెలుసా?" అన్నాడు.

"అవునండీ ఆ వివరాల కోసమే వచ్చాను..." అని ఒక్క క్షణం

గాయి. "సార్–నాకు మీరీ విషయంలో సహాయంచేయాలి."

"హంతకు డెవరో నాకు తెలుసు–అతన్ని చిత్రవధ చేయనిదే వదిలిపెట్ట కూడదు"

"ఓ మైగాడ్! మీకు తెలుసా! వాడెవడో. దయచేసి పూర్తి వివరాలు మీకు తెలిసినవి చెప్పండి మాకు చేతనైన సహాయం మేము తప్పకుండా చేస్తాము. వామన్‌కు దుఃఖంపొంగివచ్చింది. 'సార్ ఒక్కసారి నాకు జయను చూపండి.

చూడండి వామన్‌గారూ. ఇప్పుడా బాడీ పోస్టుమార్టం దశలోవుంది. కాబట్టి తర్వాత చూద్దురుగాని. ఆమె బంధువులు వగైరా ఎవరో ఆ వివరాలన్నీ మీకు తెలిసినంతవరకూ ఇవ్వండి. మీకు ఏ రకమైన సహాయం కావలసినా చేసేందుకు నేను సిద్ధంగావున్నాను."

"అలా అంటే సరిపోదు. హంతకుణ్ణి ఉరికంబం ఎక్కించనిదే విశ్రాంతి తీసుకోనని మీరు నాకు ప్రతిజ్ఞచేయాలి" వామన్ ఉద్రేకంగా అన్నాడు,

"ఆఫీసర్ నవ్వుతూ" "షూర్ షూర్ మీరు ఉద్రేకపడి లాభంలేదు– తెలిసిన సంగతులన్నీ చెప్పండి దాచకుండా. అప్పుడే మా సంపూర్ణ సహకారం లభిస్తుంది" అని బోయ్‌చేత రెండు కప్పుల చాయ్ తెప్పించాడు.

వామన్ అయిష్టంగానే తీసుకొని టీ చప్పరిస్తూ మెల్లగా కథ మొదలు పెట్టాడు...ఆఫీసర్ వివరాలన్నీ వ్రాసుకోవడం మొదలుపెట్టాడు—

వామన్ అన్ని సంగతులూ చెప్పాడు...

"ఈ పరిస్థితుల్లో రంగధామ్ ఈ ఘాతుకానికి ఒడికట్టాడని నాకు బాగా తెలుసు–దయచేసి వాణ్ణి అరెస్టు చేయండి డేవిడ్‌గారూ..."

వామన్ తీవ్రమైన ఆవేశంలో వున్నాడనీ, ఏ మాత్రమైనా అశ్రద్ధ వహిస్తే ఇతడే వెళ్ళి రంగధామ్‌ను చంపేటట్టున్నాడనీ డేవిడ్ గుర్తించాడు. సాధ్యమైనంత మృదువుగానూ, నచ్చజెప్పే ధోరణిలోనూ డేవిడ్ వామన్‌కు హితబోధచేసి అడ్రసు తీసుకొని సమయం రాగానే తాను వెంటనే వచ్చి కలుసుకొంటాననీ లేదా కబురుపెట్టగానే రమ్మనీ వామన్‌కు చెప్పాడు—

వామన్ దుఃఖాతిశయంలో మామూలు ఫార్మాలటీస్ కూడా పాటించ లేదు. "థ్యాంక్స్" చెప్పకుండానే వెళ్ళి పోయాడు.

ఆ రోజు సాయంత్రం మలక్‌పేట నుండి రిక్షామీద వస్తున్నాడు వామన్. రిక్షావాడు చాదర్‌ఘాట్ పూల్ మీది గుండా కాక అంబర్‌పేటరోడ్డు నుంచీ వస్తున్నాడు—రోడ్డంతా నిర్మానుష్యంగా

వుంది. రిక్షావాడు ఒడ ఎల్గించ పోయిన సైకిల్ ఛైను మళ్లీ సరిచేసు కొని తొక్కుతున్నాడు ఏదో గొణు గుతూ.

"ఏఁయ్ రిక్షా చడావ్ (ఎగుడు) వైపు వస్తున్నావేం?"

"చడావూ, ఉతారూ (దిగుడూ) రెండూఉన్నాయి దొరా-పైగా పూల్ దగ్గర లైటు లేకుంటే పట్టుకుంటుంద్రు."

"నీ పేరేమిటి ?"

"అప్పుడే మరిచినావా దొరా-కొమరయ్యను, శానాసార్లు చిక్కడపల్లి నుంచి మిమ్మల్ని తీసికెళ్ళిని..."

తాను కొమరయ్యకు గుర్తున్నాడు కాని తనకు రిక్షావాలా గుర్తులేడు.

"ఓహో...బాగున్నావా-"

"ఆఁ-ఏంబాగులే దొరా-నాలుగు రోజుల కూలీపెట్టినా ఒక పూట రొట్టె రావడంలా...అంతా పరేశాన్-పరే శాన్- (కల్లోలిత దశ)—"

కొమరయ్య తన కష్టసుఖాలు నిర్మొ గమాటంగా చెప్పుకుంటున్నాడు-వామన్ ఊ కొడుతున్నాడు-వినీ వినకుండా-ఉన్నట్లుండి కొమరయ్య సంభాషణ వామన్‌ను ఆకర్షించింది - కొమరయ్య భార్యయాదమ్మ కొమరయ్య డబ్బులు దొంగతనంచేస్తుందిట-ఆవిషయం తనకు తెలిసి కూడా తెలియనట్టు నటిస్తున్నాడట. 'నాకుతెల్సుదొరా' అదే తీస్తదని కాని లొల్లి(అల్లరి) చేస్తే ఫాయిదా (లాభం) పైసలు? చౌబీస్‌గంటా మెహనత్ (ఇరవైనాలుగు గంట శ్రమ) చేసి, పసినా (చెమట) నికలాయించి (బయి టకు తెప్పించి) పైసలు తెస్తే దొంగది తీసేస్తది దొరా-పైగా పక్కోళ్లతో లడాయి. ఏంబతుకులే దొరా... నిర్భర మైన జీవిత రహస్యాన్ని మింగలేక కక్కలేక గరళకంఠునివలె గళస్థం చేసు కున్నాడు కొమరయ్య-

అంబర్‌పేట రోడ్డు దాదాపు విద్యా నగర్‌లో కలిసిపోయే వరకూ మూడు మైళ్లదూరమూ నిర్మానుష్యంగానే వుంటుంది... వామనరావు స్వేచ్ఛగా ఆలోచిస్తున్నాడు. కొమరయ్య కథ వొక నాటికగా వ్రాస్తే అందులో తాను కొమ రయ్య పాత్రవేస్తే ఎలావుంటుంది? ఎలా నటించగలడు?? - నిత్యజీవితంలో ఒకవేళ తన భార్య అలా వుంటే... ఈ ఊహతో, జయలక్ష్మి జ్ఞప్తికి వచ్చింది-

మనస్సంతా విషాదంతో నిండి పోయింది...

ఆమె ఇక కనబడదు...

తనకిక ఆ మాటలు విన్పడవు...

జయలక్ష్మి స్మరణతో రంగాధామ్ గుర్తుకొచ్చాడు-డేవిడ్ "వామన్! డోన్ట్ వర్రీ - రంగధామ్‌ను ఉరికంబం ఎక్కించే బాధ్యత నాది" అన్న మాటలు

మళ్లీ కొంత మనశ్శాంతిని కలుగ జేసాయి...

కొమరయ్య ఏమిటేమిటో చెప్పు తున్నాడు. రిక్షాను న్యూ నల్లకుంటనుండి అడ్డంగా తిప్పి కోరంటికెదురు బ్రిడ్జి క్రిందిగుండా తీసుకొచ్చి యువతీమండలి వద్దకు వచ్చాడు...మళ్లీ జనసంచారం.. జనసందోహం... ఆదుర్దాగా, హడా వుడిగా, అర్థరహితంగా ఎక్కడెక్కడికో పరుగెత్తే వాహనాలు... కొమరయ్య సాయంత్రం కాగానే గుడంబా తీసు కుంటాడట, ఈ బాధమరచిపోయేందుకు? "ఈ బాధ మరచిపోతాను దొరా"

"ఏ బాధ? ? రిక్షాలాగినబాధా ? భార్య బాధా?"

రిక్షా లింగంపల్లి పూల్ దగ్గరికి రాగానే యాదమ్మకు ఆ పగలు సంపా దించిన డబ్బులు ముందుగానే లెక్కపెట్టి ఇచ్చాడు. "పోయి రొట్టె చెయ్యి - ఈ బాబును చిక్కడపల్లిలో వదిలేసి వస్తా" నని వాళ్ల భాషలో చెప్పాడు - యాద మ్మను చూచాడు వామన్.

అసహ్యం వేసింది - అమాయకుడైన కొమరయ్యను వేధిస్తున్నది బుద్ధి లేకుండా.

ఓర్పు కలవాడు కాబట్టి సరిపోయింది కాని తానైతే చంపేసేవాడు...

యాదమ్మ కొమరయ్యను ఏదో తిడు తున్నది.

కొమరయ్య మాట్లాడకుండా రిక్షాను ప్రజాఫార్మశీవద్ద నిలిపాడు.

వామన్ కొమరయ్యకు డబ్బులిచ్చి పంపాడు.

గదికి వెళ్ళి పడుకున్నాడు - నిద్రపట్ట లేదు.

మనస్సంతా కదిలించిన కందిరీగల తుట్టెలా వుంది... అలాగే కళ్లు మూసు కున్నాడు-ఏ రాత్రికో నిద్రపట్టింది...

చీకటి దట్టంగా హైదరాబాదుపై తారు పూత పూసింది.

అర్ధరాత్రి-పన్నెండు గంటలు దాటిం దేమో-

వామనరావు లైటు వేశాడు.

గుడ్డలూ చెప్పులూ వేసుకొని గదికి గొళ్ళెం తగిలించి మెట్లు దిగాడు...

క్రింద కుక్క భౌభౌమని పరిచయ మైన మనిషి కాబట్టి మళ్లీ ముడుచుకుని పడుకున్నది...

వామనరావు జాగ్రత్తగా అడుగులో అడుగు వేసుకుంటూ లింగంపల్లి పూల్ వద్దకు వెళ్లాడు.

కోటగోడ కానుకొని లంబాడీలంతా నిద్రపోతున్నారు.

ఒక్కొక్క ముఖమే వెతుకుతూ దొంగలా అడుగులు వేసుకుంటూ నడి చాడు,

యాదమ్మ ఓ మూల ముడుచుకొని పడుకున్నది-



తలపడ్డ ఓ రెండు పండుకునే బొచ్చెలు - నాలుగు బొంతలు - పొయ్యి రాళ్లు...

సింహం విశాలంగా పంజా విప్పినట్లు వామన్ రెండుచేతులూ భయంకరంగా జాపి యాదమ్మ మెడను గట్టిగా పట్టుకొని అటూ ఇటూ ఊపి కోడిని నులిమినట్లు నులిమాడు - యాదమ్మ సన్నని నిస్సహాయ ధ్వని చేసింది.

ఇంతలో బలమైన లాఠీదెబ్బ వెనుక నుంచి వామన్‌పై పడ్డది.

ఆ దెబ్బతో వామన్ క్రింద పడిపోయాడు-

డేవిడ్ వామన్‌ని తన వాన్‌లో వేసుకొన్నాడు. గందరగోళానికి అంతా లేచారు.

కొమురయ్యా పాపం రెండో ఆట సినిమాజనం కోసం ఏ హోటలువద్దో కాచుకూర్చున్నాడు.

అంతా తలో మాటా అంటున్నారు

ఎటు చూచినా గందరగోళమే.

డేవిడ్ యాదమ్మను పరీక్షించాడు

అప్పటికే ఆవిడ ప్రాణం పోయింది

* * *

"దొంగవెధవ ఎంతపని చేశాడు : చేజేతులా రెండు నిండు జీవితాలను బలి తీసుకున్నాడు," తోటి పోలీసు ఆఫీసర్ డేవిడ్‌తో అన్నాడు.

"అయాం సారీ ఫ్రండ్ - దగ్గర ఇరానీహోటల్లో ఉండి కూడా యాదమ్మను రక్షించలేకపోయాను... అయితే నా విషయ సేకరణవల్ల తేలిన సారాంశ

చేయలేదు... రంగధామ్, కొమరయ్యలే చేశారు..."

"అంటే" నివ్వెరపోయి అడిగాడు అవతలి ఆఫీసరు. "అంటే యీ రెండు హత్యలూ జరిగినప్పుడు వామనరావు నిద్రపోతూనేవున్నాడు – రెండుహత్యల సంగతి అతనికి తెలీదు – నాకెందుకనో వామన్ ఉద్రేకం చూచినదగ్గరనుంచీ అతని సమాచారం సేకరించాలని మొదటి నాడే అనిపించింది – అతని స్నేహితుడు రమేష్ వామన్ మనస్తత్వాన్నిగూర్చి అందజేసిన సమాచారం నన్ను ఆలోచనలోకి దింపింది. చిన్నప్పుడు నాటకాలు వేసిన రోజుల్లో వామన్ తా నాపాత్రలో లీనమైపోయేవాడట... దీనివల్ల అతని మనస్థితి గూర్చి నేను అనుమానించసాగాను. తొలి హత్య సందర్భంలో కూడా అతడు నిద్రలోనే నడిచి టాంక్ బండ్ వెళ్ళాడు. అక్కడ జయ తో మాట్లాడుతూనే చంపివుంటాడు. అనంతరం మళ్ళీ వచ్చి పడుకున్నాడు. వామన్ జయ తనతో రంగధామ్ గూర్చి చెప్పినప్పటినుండీ రంగధామ్‌గూర్చే ఆలోచించడం మొదలుపెట్టాడు. ఆ ఆలోచనలో తానే రంగధామ్ స్థానంలోవుంటే ఏమైవుండేదన్న భావంకూడా అతనికి కలిగింది. చూస్తుండగానే అది బలపడిపోయింది. తాను పూర్తిగా రంగధామ్ పాత్రలో లీనమైపోయాడు. నిజంగా తన ఊహాగానంతో రంగధామ్‌ను సృష్టించుకొని తానందులో తాదాత్మ్యం పొందాడు. ఫలితంగా రంగధామ్ మనస్తత్వంతోనే జయను చంపాడు. తిరిగి యథాప్రకారంగా నడిచి వచ్చి మామూలుగానే నిద్రపోయాడు. కాబట్టే అందరిలాగే తాను కూడా మర్నాడు ఉదయం పత్రికలో వార్తను చూచి ఆశ్చర్యం చెందాడు. విలపించాడు. తనంతతానే వచ్చి రిపోర్టు చేశాడు.

ఆ నాటి నుంచి నేను నీడలాగు ఇతన్ని అనుసరిస్తూనే వున్నాను. మొన్న సాయంత్రం జరిగిన సంఘటన కూడా అలాంటిదే కొమరయ్య భార్య యాదమ్మ తన భర్తనే మోసగించడం విన్నప్పుడు వామన్‌కు సహజంగానే బాధ కలిగింది. తానే ఆ భర్త స్థానంలో వుంటే దాన్ని చంపి వుండే వాడనని భావించాడు. పగలు సంస్కారమూ, సంఘమూ అణచివుంచిన భావాలు రాత్రి పూట నిద్రలో స్వేచ్ఛగా రెక్కలుతొడుక్కొని విహరించాయి. అది ముఖ్యంగా వామన్‌లో కార్యరూపం ధరించాయి. నరాల బలహీనతగల వామన్ నిద్రలో లేచి నడిచి వెళ్ళి లింగంపల్లి పూల్ చేరాడు నాకీ రిక్షా వాడితో జరిగిన సంభాషణ తెలియకపోయినా ఇతని అలవాట్లు ముఖ్యంగా నిద్రలో నడక వంటిది వుందేమోనని అనుమానించి దానిని

ఘాయం చేసుకోవడంకోసం ఇలా నిఘా వేసేవుంచాను. అందుకే ఇప్పటిదాకా ప్రజాఫార్మసీ వద్దనే ఉండి వచ్చి ఈ హోటల్లో చాయ్ తాగుతూ కూర్చున్నాను— ఇంతలోనే ఈ రెండవ ఘోరమూ జరిగిపోయింది."

"మరి ఇతడు శిక్షార్హుడేనా?"

"ఒక రకంగా చూస్తే కాదు. కాని మరొక రకంగాచూస్తే మామూలు నేరస్థునికన్నా ప్రమాదకరమైనవాడు. సంఘద్రోహి తన లోపలి భావాలకు అర్ధరాత్రి పూట కార్యరూపం ఇస్తుంటే సమాజంలో ఇంకా ఎందరో ఇలా బలికావడంతథ్యం. సబ్-కాన్షస్ స్టేజ్ (ప్రత్యక్ చైతన్యావస్థ) లో ఇతడు తనలోని బలహీనతలను వెలిబుచ్చుతాడు. అంతేకాదు. తనలో అణచుకొన్న అనేక భావాలూ ఉద్రేకాలూ ఆవేశాలూ కూడా తాను నిద్రపోయేటప్పుడు తాము నిద్ర మేల్కొంటాయి. ఇది ఆరోగ్యవంతుని లక్షణం కాదు."

వామనరావుకు ఉరిశిక్ష విధించారు.

ఈ కేసును మొదటి నుంచే పరిశీలించిన ప్రభుత్వ ఆసుపత్రిలోని మన స్తత్వశాస్త్రవేత్త డాక్టర్ ప్రభాకర్ వామన్‌ను తన కివ్వవలసిందిగా కోరాడు. "నేను చేసే ప్రయోగంలో ఒక వేళ వ్యక్తి చనిపోనుకూడావచ్చు. అందుకనే ఇతని మీద నా ప్రయోగం చేస్తాను. ఇది సైకో థెరపీకి సంబంధించినది. సైకో థెరపీ ఇలాంటి బలహీనులలయిబ ... ... చేస్తుంది. కాబట్టి నా కితన్ని స్వాధీనం చేయవలసిందిగా కోరుతున్నాను." అని అర్జీ పెట్టుకున్నాడు వామన్‌ను ప్రభాకర్‌కు స్వాధీనంచేశారు ప్రభుత్వంవారు.

ప్రభాకర్ తన బృందంతో వామన్ మన స్తత్వాన్ని బాగా విశ్లేషణ చేసి చూశాడు. మానవుడిలో వ్యక్త, వ్యక్తావ్యక్త, అవ్యక్తములనే మూడు దశలున్నాయి. ఇప్పటివరకూ వామన్ తన అవ్యక్తమైన సుషుప్తిలోనే ఈ అత్యాచారాలు చేస్తున్నాడు. ఇప్పుడు వ్యక్తంలోనే ఇతనిపై ప్రయోగం చేయాలని ప్రభాకర్ నిశ్చయించాడు.

కాంపౌండర్లూ, నర్సులూ అంతా ఒక గది వద్ద పెద్దగా అట్టహాసం చేస్తున్నారు...

వామనరావును తీసుకొచ్చి అటూ ఇటూ కదలకుండా మంచానికి కట్టివేశారు వామనరావు భయంభయంగా ఆపరేషన్ టేబుల్‌వైపు చూస్తున్నాడు. అక్కడ కత్తులూ కటార్లూ వగైరాలున్నాయి.

ఒక నర్సు వామనరావు కళ్లకు గంతలు కట్టాడు.

మరొకరు వామనరావు కాలికి ఆపరేషన్ చేయబోతున్నట్లు చెప్పారు.

ఇంకొకరు కత్తులూ కటార్లూ వగైరా కదిలించారు గలగల మ్రోగించారు..

"సార్ నన్ను వదిలిపెట్టండి ఒకవేళ చంపదలచుకొంటే ఒక్కసారి చంపండి

కాని ఇలా కోతలుకోసి చిత్రహింస చేయకండి వామనరావు భయంగా జాలిగా అరిచాడు

రాత్రి...

బయటంతా కారు చీకటి. వామన్ మనస్సులోవలెనే... గదిలో మాత్రం వెలుగులు. ప్రయోగంపట్ల ఆసక్తిగల ప్రభాకరం మనస్సులోవలె.

వామనరావుకు ఏమీ కనపడటంలేదు.

ఊపిరి బిగపట్టి జరుగుతున్నదంతా చెవులతోనే చూస్తున్నాడు.

బూట్లు టక టక !! ప్రభాకర్ రాకను సూచిస్తూ అంతా నిలబడ్డ ధ్వని—ప్రభాకరం కంఠం విన్పడింది.

'ఫ్రెండ్స్! ఇతని కాలిపైన ఆపరేషన్ చేస్తున్నాను—ఓ అర్ధగంట సేపట్లో ఇతడు బలహీనుడై పోతాడు. దాదాపు ఓ గంట సేపట్లో ఆగాటుగుండా శరీరంలోని రక్తమంతా పూర్తిగా కారిపోయి ఇతని గుండె స్తంభించిపోతుంది మెదడు ఇక పనిచేయదు...ఏదీ...ఆఁ...ఇటు ఇటు...కమాన్"... ప్రభాకరం వామన్ అరికాలిలో ఓ గాటు పెట్టాడు...

టప టప మని క్రింద బిందువులు బిందువులుగా రక్తంబొట్లు పడుతున్న ధ్వని...

కెవ్వున కేక వేశాడు వామన్... పెద్దగా రోదించాడు.

గుండెలు అవిసిపోయేటట్లు భయంతో అరిచాడు...

'ఫ్రెండ్స్; కమాన్—గది ఖాళీచేయండంతా' వెంటనే అంతా వెళ్లిన ధ్వని!!

తలుపులు మూసుకున్నాయి...

టప టపమని రక్తంబొట్లు నిరవధికంగా పడుతున్న ధ్వని...

వామన్ అరుపులు ఓ పది పదిహేను నిముషాల తర్వాత విన్పించలేదు... తన శరీరంలోని రక్తమంతా క్రమంగా కోల్పోయి ఓ అర్ధగంటకల్లా అరిచే ఓపిక కూడా లేనంతగా బలహీనుడైపోయాడు....ఇంకా రక్తం అలా టప టప క్రింద బేసిన్‌లో ధ్వనిచేస్తూ పడుతూనే వుంది...

అర్ధగంట...గంట... గంటన్నర...

రెండు గంటలు—నూట ఇరవై నిమిషాలు —'తలుపులు తీయండి' ప్రభాకరం కేంచూసుకొని కేక వేశాడు. తలుపులు తెరుచుకున్నాయి...

వెళ్లి చూచారు—మంచంమీద వామన్ చనిపోయి పడి వున్నాడు—అతని గుండె స్తంభించిపోయివుంది—

ప్రభాకరం వామన్ అరికాలిని పరిశీలించి చూచాడు—

కేవలం ఎర్రని సన్నని గాటుమాత్రం వుంది—రక్తపు ఛాయలు కూడా పైకి కన్పడటంలేదు...

వామన్ కాళ్లవైపు పెట్టిన కొళాయి వున్న కూజానుండి క్రింది బేసిన్‌లోకి నీటిబొట్లు ఇంకా అలాగే టప టపమని పడుతూనే వున్నాయి.